


# నువ్వంటేనే నాకిష్టం!

కోడూరి శ్రీరామమూర్తి

SARASWATA NIKETANAM
VETAPALEM

నాపేరు శేఖరం—మా తాతయ్యగారి పేరు చంద్రశేఖరంగారట—అందుకని నాకా పేరు వచ్చింది—నాపేరు చూచి నేను చాలా పెద్ద వాణ్ణనుకోకండి—మొన్ననే నాకు ఎనిమిదో ఏడో వచ్చింది—ఇప్పుడయితే చాలా పెద్దవాణ్ణయి పోయాను గానీ—చిన్నప్పుడు అల్లరి బాజాలాగా వుండేవాణ్ణట—పైగ ముద్దొచ్చే బుద్ధులు కూడా బోలెడు వుండేవట—ఇప్పుడుకూడా కొన్ని వున్నాయనుకోండి—నాకు తెలియదు అమ్మ అంటూ వుంటుంది — నా అల్లరి మా అమ్మకు జ్ఞాపకం వున్నంత మరెవరికీ జ్ఞాపకం వుండదు—అయినా మీరే చెప్పండి—కర్రగుర్రం మీద స్పీడుగా స్వారీచేస్తూ విరోధి సైన్యాలమీద 'ఢాం ఢాం'అని తుపాకి పేలుస్తూ యుద్ధం చేసినంతమాత్రాన అది అల్లరి అయి పోతుందా? — ఈ మాత్రం గోలకూడా లేకుండా యుద్ధాలు పూర్తయి పోవాలంటే ఎలా చెప్పండి?—సరే!—ఇప్పుడా గొడవంతా ఎందుకుగానీ నేను చిన్న వాడుగా వున్నప్పుడు జరిగిన కథ ఒకటి చెబుతాను—వినండి—

* * *

—ఆవేళ నాకు భలేకోపం వచ్చింది—ఎగ్జిబిషన్‌లో కొన్న కొత్తబొమ్మను ఓ మూలకు విసిరేశాను.

కర్రసిపాయిని నేలకేసి కొట్టాను—కసిగా జుట్టు పీక్కున్నాను.

అమ్మ ధోరణి నాకేమీ నచ్చలేదు—ఇంట్లో నేననే మనిషిని వున్నట్టు అమ్మకి జ్ఞాపకంకూడా వున్నట్టులేదు—ప్రొద్దున్న నేను స్కూలుకు వెళ్లలేదన్న విషయంగానీ—టిఫెనుకూడా సరిగా తినలేదన్న సంగతి కానీ—అమ్మ పట్టించుకున్నట్టేలేదు—

అవును — ఎందుకు పట్టించుకుంటుంది?—అసలు నేను ఈలోకంలో వుంటేగా—

నాకు మాత్రం నాన్నని చూడాలని లేదూ—నాన్నతో మాట్లాడాలని కోరికగా లేదూ—

అంత మాత్రాన అన్నీ మరిచిపోయి నాన్నగురించి ఆలోచిస్తూ కూర్చున్నానా అని—

అమ్మ అసలు ప్రొద్దున్న నించీ ఖాళీగా వున్నట్టులేదు—ఇప్పటిదాకా బోలెడన్ని లడ్డూలు చేసి సీసాలో మూత

పెట్టిదాచింది. 'నాన్న వచ్చాక తిందాం—' అంటూ—

ఇప్పుడు ప్రక్కగదిలో నేను దాచుకున్న ఆ సామానునంతా మంచాల కిందకు తోసేసి గదినంతా 'నీట్'గా సర్దుతోంది—

అమ్మసంగతి చూస్తూంటే కోపం ముంచుకు వస్తోంది—

'అమ్మా—' అన్నాను కోపంగా—

దానికి సరిగ్గా సమాధానం చెప్పక పోగా—నావేపు తిరిగి 'అప్పుడే జుట్టంతా చెరిపేసుకున్నావా?— నాన్న వచ్చే టైమ్ అవటంలేదూ!—' అంది—

'ఎప్పుడో సాయింత్రం కదా వచ్చేది!—' అన్నాను బాధను దిగమ్రింగు కుంటూ—

'నీ మొహం—రెండున్నర కల్లా బండి వచ్చేస్తుంది—బండిలో నాన్నకూడా వచ్చేస్తారు'—

రైలు బండిలో నాన్న వచ్చేస్తాడన్న వూహ నాకు చాలా ఆనందాన్ని కలిగించింది—అయితే ఇంతలోనే ఇంకో సందేహం వచ్చింది—

'మరి—రోజా రైలుబండి వస్తోంది కదా!—ఇన్నాళ్లూ నాన్న రాలేదేం—'

'రైలు ఎక్కకుండా నాన్న ఎలా వస్తారు?—ఇన్నాళ్లూ ఆ పాపిష్టివాళ్లు నాన్నను విడిచి పెడితేగా—'

ఆ 'పాపిష్టివాళ్లు' ఎవరో నాకు తెలుసు—వాళ్ల సంగతి అమ్మ నాకెప్పుడూ చెపుతూనే వుంటుంది. ప్రపంచ పటంలో పాకిస్తాన్‌ని చూచినప్పుడల్లా నాకు నాన్నే జ్ఞాపకం వచ్చేవాడు—యుద్ధంలో మన సైనికులకు పాకిస్తాన్ సైనిక స్థావరాల రహస్యాన్ని చెప్పాడని—పాకిస్తాన్ సైనికులు మోసం చేసి నాన్నను ఖయిదీగా పట్టుకున్నారట—అయితే—నాన్న చెప్పిన విషయంవల్ల మనవాళ్లకు ఎంతో అపకారం జరిగిందట—అలా నాన్న ఖైదీగా చిక్కకపోతే మేం చాలా హాయిగా వుండేవాళ్లమట—

'అమ్మా!—నాన్నని మరి జైల్లో పెట్టారా?—' అమ్మని అడిగను నేను—

పుస్తకాలు సర్దుతూ అంది అమ్మ—

'[illegible] నాన్నను జెయిల్లో పెట్టడం [illegible]—ఎంతో గౌరవిస్తారు— పెద్ద [illegible]ద్యోగం ఇస్తారు—'

'[illegible] పెద్ద ఉద్యోగం అంటే?'

'ఏమో తెలియదు—ఇంతకన్నా పెద్ద ఆఫీసరు వుద్యోగం—బహుశా కర్నల్ పదవి ఇచ్చినా ఇవ్వవచ్చు—'

అంతలోనే ఇంకో సందేహం—

'అప్పుడు కూడా మనం ఇక్కడే వుంటామా?'

నా మాటలకు నవ్వింది అమ్మ—

'ఇక్కడెందుకు వుంటాం?—హాయిగా నాన్నతో వెడతాం— అప్పుడు నువ్వు నాన్న వడిలో కూర్చుని దర్జాగా ఎన్నో వూళ్లు చూడవచ్చు—'

ఈ మాటలు నాకెంతో సంతోషాన్ని కలిగించాయి.

'అమ్మా!— నాన్న మంచివాడేనా—నేనంటే ఇష్టమేనా!—' అన్నాను.

ఆ మాటలకు అమ్మ ఫక్కున నవ్వింది—'పిచ్చీ!—నువ్వంటే నాకూ నాన్నకూ ఇష్టం వుండకపోతే మరెవరికి వుంటుంది? నువ్వే చూద్దువుగాని...' అంది నా బుగ్గమీద చిటికె వేస్తూ.

నాన్న సంగతి ఏమోగాని—ఆ మీసాలు మాత్రం నాకేం నచ్చలేదు—ఆ ఫోటోలోని మీసాలు చూస్తూంటేనే భయంగా వుంది—ముద్దు పెట్టుకోవాలంటే భయం వెయ్యదూ?— ఈ మాటే చెప్పేశాను అమ్మతో—

అది విని — అద్దాన్ని తుడుస్తూ అంది అమ్మ నవ్వుతూ 'వచ్చిన తర్వాత మీ నాన్నతో చెబుదువుగనిలే— మీసాలు తీసెయ్యమని—'

అద్దంలో హాయిగా నవ్వుతున్న అమ్మ ప్రతిబింబం కనబడింది నాకు—

* * *

స్టేషనంతా హడావిడిగా వుంది—రైలు కోసం ఎదురుచూస్తూ జనం ప్లాట్‌ఫారంమీద పడిగాపులు పడివున్నారు.

'నాన్న రాగానే ఏం చెయ్యాలి?—' అమ్మను అడిగాను నేను—

'నమస్కారం పెట్టాలి—' అంది అమ్మ—

'ఆ తర్వాత?—'

'—ఆ తర్వాత నువ్వు ఏమీ చెయ్యనక్కరలేదు—నాన్నే నిన్ను ఎత్తుకుని ముద్దు పెట్టుకుంటారు—'

నాకెంతో సంతోషం కలిగింది—నా మనస్సు తహతహ లాడిపోతోంది—కథల్లో రాక్షసిని చంపేసిన రాకుమారుడిలాగా ఎంతోమంది విరోధుల్ని తుపాకితో కాల్చి చంపిన నాన్నను చూడాలని నాగుండెల్లో కుతూహలం ఉరకలు వేస్తోంది—'బండి త్వరగా వస్తే బాగుండును—' విసుక్కుంటూ అనుకున్నాను నేను.

ఇంతలో బండి రానేవచ్చింది—

ఉద్దుగా అమ్మ ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్‌ల వైపు పరిగెట్టింది— ఇంతలో వో భారీఎత్తు మనిషి వో కంపార్ట్‌మెంట్ లోంచి దిగాడు చేత్తో సూట్‌కేస్ పట్టుకుని—అమ్మని చూడగానే ఆ మీసాలమనిషి 'హలో!— నళీ!—' అన్నాడు నవ్వుతూ—

ఇదివరకే ఫోటోలో చూశానుగా!—నాన్నను గుర్తు పట్టగలిగాను నేను—'గుడ్‌మార్నింగ్—డాడీ!—' అన్నాను.

అప్పుడు నాన్న నావైపు తిరిగి ఆశ్చర్యంలో అన్నాడు—

'వీడేనా మన వంశోద్ధారకుడు—ఎవరో అనుకున్నాను—ఏరా కేప్టెన్!—' అన్నాడు బుగ్గమీద చిటికెవేస్తూ.

బొత్తిగా మంచీ మర్యాదా లేకుండా ఏమిటా పలకరింపు అనిపించింది—పెట్టెను కూలీ చేతికిచ్చి అమాంతంగా నన్ను ఎత్తేసుకున్నాడు— నన్ను ముద్దు పెట్టుకుంటూ 'చాలా పెద్దవాడై పోయాడు. అప్పుడు వేలెడంత వుండేవాడు — చాలా బుద్ధిమంతుడు లాగా వున్నాడు—అల్లరీగిల్లరీ చెయ్యడుగా!—' అన్నాడు అమ్మతో.

ఆ మాటలకు నవ్వింది అమ్మ—'అలా అనుకుంటూ వుండండి—వాడి అల్లరేమిటో మీకే తెలుస్తుంది—'

కొత్తమనిషిని ఎదుట పెట్టుకుని అమ్మ నా గురించి అలా మాట్లాడడం నాకు నచ్చలేదు—అమ్మకు కూడా మంచీ మర్యాదా పోతోంది.

తిరిగి అమ్మ మాట్లాడింది— 'చాలా చిక్కిపోయారు — మళ్లీ నాకీ అదృష్టం కలుగుతుం దనుకోలేదు — అయిదేళ్లయి పోయింది—'

అమ్మ కన్నీళ్లు తుడుచుకొంటోంది—అసలు ఏడు పెందుకు వచ్చిందో అర్థంకాలేదు నాకు—

అయినా—నాన్న ఏమంత చిక్కిపోయి వున్నాడనీ?—ఏమో!— ఇదివర కెంత

ప్రపంచంలోని అద్భుతమైన హోం
సినిమా చూచి ఆనందము పొందండి



సినిమాలలోవలె విూ అభిమాన సినీతారలు అద్భుతంగా శృంగార, హాస్య, యుద్ధ, కార్టూన్ చిత్రాలలో నటించటం చూపించి ఆనందించండి. 4' × 3' తెరపై ఎలెక్ట్రిసిటీతో లేక టార్చితో. అన్ని సంతలందు, ప్రదర్శనములందు చూపించి డబ్బు బాగా సంపాదించండి లేక మిత్రులతో, కుటుంబంతో ఇంట్లోనే ఆనందించండి. సూపర్ స్పెషల్ ప్రొజెక్టర్ రు 45/- 100 అ॥ ఫిలిం, స్క్రీన్, ఫిలిం లిస్టు ఉచితం. (పోస్టేజి & ప్యాకింగు రు. 6 50) అదన ఫిలిమ్ 100 అ॥ రు 10. త్వరపడండి. నేడే మీ ఆర్డరు పంపండి.

AMERICAN CINEMA SUPPLIES.
Kalyanpura, Delhi-6.

ఏజెంట్లు కావలెను
(రు. 1000/- సంపాదించండి)

జీతంమరియుకమిషన్‌మీద స్టాండర్ ఆఫ్ వరల్డ్ ట్రాన్‌సిస్టర్లు మరియు ఇండియన్ ఆర్టు చీరలకు ఆర్డర్లు బుక్‌చేయుటకు



ఏజెంట్లు కావలెను. ఉచితషరతులకు మరియు శాంపిలుకై నేడే వ్రాయండి.

BHARAT AGENCIES. (59)
Kolhapur, Delhi—7.

ఏజెంటు కావలెను




జపాను ఆర్టు చీరలు, టెర్లిన్ సూటింగులు, రెడీమేడ్ దుస్తులు, నైలాన్ సాక్సు, టైలు, స్టెయిన్‌లెస్ స్టీలు పాత్రలు వగైరాలకు ఆర్డర్లు బుక్‌చేసి, నెలకు రు 550—గాని మంచి కమీషన్ గాని ఆర్జించండి. ఉచిత షరతులకు, పూర్తి సైజు శాంపిల్సుకు వ్రాయండి.

WRITE TODAY
BOMBAY AGENCIES
Kalyanpura, Delhi-6.

# నువ్వంటేనే నాకిష్టం!

లావుగా వుండేవాడో!—

జట్కాలో కూర్చున్నతర్వాత అంది అమ్మ నాతోటి— 'ఏరా !— నాన్నను చూడాలని తెగ కలవరించావు — ఏం మాట్లాడవేం మరి ?—'

అయినాసరే—నేను మాట్లాడలేదు— అదీ కాకపోయినా అంత పెద్దమనిషితో ఏం మాట్లాడతాం ?—

'ఏమిట్రా అంత పరీక్ష పెడుతున్నావ్ ?—' అంటున్నాడు నాన్న —

'మిమ్మల్ని కాదు — మీ మీసాల్ని !— వాటిని చూస్తే మీ వంశోద్ధారకుడికి హాళ్ళుమంట !—'

తనివి తీరా నవ్వుతోంది అమ్మ!—

* * *

నాన్న వచ్చి పదిరోజు లయింది—

కాని—ఇంటి వాతావరణం పూర్తిగా మారి పోయింది—

నాన్న ఇంటికి ఒక రాజులా అయి పోయాడు—

'ఉష్ !— నాన్న నిద్ర పోతున్నారు—'

'అలా చేస్తే నాన్నకు కోపం వస్తుంది—'

'నాన్నతో చెబుతాను చూడు—'

'నాన్న ఏమంటారో ?—'

ఇలాంటి మాటలు ఇంట్లో తరుచూ వినబడ సాగాయి.

ఇదివరకటిలా ఇంట్లో గోల చెయ్యడానికి వీలులేదు—పొరుగు పిల్లల నందరినీ పోగుచేసి ఇంటిలో రైలుబండీ ఆట ఆడుకోడానికి వీలు లేదు. ఎప్పుడుబడితే అప్పుడు అమ్మతో కలిసి సరదాగా పక్కింటి సీతమ్మగారింటికి వెళ్ళడానికి వీలులేదు — రాత్రిపూట వెన్నెల్లో అమ్మ చెప్పేకథలు వింటూ గోరుముద్దలు తినడానికి అవకాశమే చిక్కడం లేదు—

ఎప్పుడూ నాన్న—నాన్న—నాన్న ?—

నాన్న వస్తేగాని ఇంట్లో ఎవరూ భోజనం చెయ్యడానికి వీలులేదు.

నాన్నకి వీలయితేనేగాని సినిమాకు వెళ్ళడానికి వీలులేదు.

నాన్న ఉత్తరం రాసుకుంటున్నాసరే ఇంట్లో ఎవరూ నోరెత్తడానికి వీలులేదు— ఏమిటితని అధికారం? — ఏమిటితని గొప్పతనం?' — నాకు వొళ్ళు మండి పోతోంది—

నాన్న వచ్చినప్పటి నించీ చూస్తున్నాను నేను అమ్మ వరస — పాటలు తెగపాడుతోంది — చాలా సంతోషంగా వుంటోంది—నేను పరీక్ష పేసయినప్పుడు కూడా అంత సరదా పడలేదు—

నేను పది నిముషాలు ఆలస్యంగా నిద్ర లేస్తే కేకలేసే అమ్మ నాన్న ఏడు గంటలకూడా నిద్ర లేవకపోయినా సరే ఒక్కమాట కూడా అనదు—అంతేకాదు— ఎంతో తియ్యగా పలకరించి పక్క దగ్గరకే కాఫీ తీసుకు వస్తుంది. పళ్ళు తోముకోకుండా కాఫీ త్రాగే ఆ పాడు బుద్ధికి చివాట్లు పెట్టక— 'దొరగారికి బెడ్‌కాఫీ బాగుందా?—' అంటుంది నవ్వుతూ—సిగ్గులేక పోతేసరి—

నేను ఎప్పుడయినా సినిమాకు వెడదాం అంటే ఇవాళ కాదు —రేపు — రేపుకాదు ఎల్లుండి—అనీ, పరీక్షలు ముందు పెట్టుకుని సినిమాలేమిటనీ ఇన్ని వంకలు చెబుతుంది కదా—కాని, నిన్న కాక మొన వచ్చిన నాన్న సినిమాకు వెడదామంటే చాలు గబగబా తయారైపోయి రావడమే కాకుండా — 'ఆలస్యం చేశానా?—' అంటుంది పైగా—ఏం మనిషి బాబూ—

వచ్చి పది రోజులయినా కాలేదు — అప్పుడే నాన్న అమ్మను బాగా లొంగ దీసుకున్నాడు— తనమాట కాదనకుండా చేసుకున్నాడు. ఇన్నాళ్ళ బట్టీ వున్న నేను ఎందుకూ పనికి రాకుండా పోయాను. బుంగమీసాలు — మిడిగుడ్లూను — ఏం బావుంటాడు బాబూ నాన్న?'

పైగా అతనికి అసలు పెద్ద మనిషి తరహాయే లేదు—నాన్నంటే హెడ్‌మాస్టర్ లాగా పంచె కట్టుకుని — పైకండువా వేసుకుని — చేతిలో కర్ర పట్టుకుని వుంటాడనుకున్నాను—కాని — అబ్బే — బొత్తిగా ఇలా వుంటాడనుకోలేదు— 'ఏరా కర్నల్' 'ఒరేయ్ కేప్టెన్' 'ఏరా కమేండర్' అంటూ నోటికొచ్చిన పేరుతో పిలుస్తూ వుంటాడు—అతను ఏ పేరుతో పిలిచినా పలకాలిట—పలక్కపోతే కోపం— నాన్నకు కాదు—అమ్మకు వస్తుంది. పైగా నేను ఏమన్నా అనబోతే 'నాన్న ఇన్నాళ్ళూ చాలా కష్టపడి వచ్చారు—

ఇప్పుడు మనం ఆయన్ని సంతోష పెట్టాలి—ఆయనకు విశ్రాంతి ఇవ్వాలి—' అంటుంది. మహా తనే పడిపోయాను కష్టం— ఎంతో మంది చచ్చిపోతే గాని మన దేశానికి స్వతంత్రం రాలేదట— హెడ్‌మాస్టర్‌గారు చెప్పారు.

ఈ నాన్న వచ్చాక అమ్మకి పోకిరీ బుద్ధులు కూడా వచ్చాయి. ఆ మధ్య— ఏదో సినిమాకు వెళ్ళినప్పుడు అందులో రాకుమారుడు రాకుమారిని గట్టిగా కౌగలించుకుంటే అమ్మ— 'ఛీ! — పోకిరీ బుద్ధులు!—' అని గొణుక్కుంది. అంతే కాదు—పక్కింటి సీతమ్మగారితో ఈ విషయం చెప్పి 'అబ్బే!—ఈ సినిమాల వల్ల జనానికి పోకిరీ బుద్ధులు ఎక్కువ అయిపోతున్నాయి—' అంది—

ఇప్పుడు అమ్మ మాత్రం?—మొన్న రాత్రి నేను ముందు గదిలో కూర్చుని లెక్కలు హోమ్‌వర్క్ చేసుకుంటున్నాను కదా—అప్పుడు అమ్మ ప్రక్కన వున్న గదిలో ఏదో పత్రిక చదువుకొంటోంది. అప్పుడు నాన్న ఆ గదిలోకి మెల్లిగా వెళ్ళి హఠాత్తుగా అమ్మ కళ్ళుమూసేసి బుగ్గలు ముద్దుపెట్టుకున్నాడు. దానికి అమ్మ ఏమీ అనకపోగా 'ఉష్! — శేఖరం!—, అంది — అక్కడికి నేను అడ్డం అయిపోయినట్టుగా — ఛి — ఛీ! — ఇదెక్కడి మనిషి?—ఎక్కడో పాకిస్తాన్లో పడివుండక ఈ నాన్న మమ్మల్నందరినీ పాడు చేస్తున్నాడు— నాకేం చెయ్యాలో తెలియకుండా వుంది—

ఈ నాన్న కోసం ఎన్నాళ్ళు ఆత్రుతగా ఎదురు చూశాను—నాన్న వస్తే ఎన్నెన్నో చెయ్యాలని కలలు గన్నాను. కాని — నాన్నకు నా సంగతే పట్టినట్టు లేదు. ఎప్పుడో బుద్ధి పుడితే మాత్రం అమాంతం పైకి ఎత్తుకుని ముద్దు పెట్టుకుంటాడు—అప్పుడు కూడా నాకు అసహ్యమే కలుగుతుంది—మీసాలు మూతికి గుచ్చుకుంటాయి. ముద్దు పెట్టుకున్నాడన్న సరదాయే వుండదు—

పైగా అస్తమానూ నాతో అంటూ వుంటాడు— 'ఏరా! —నువ్వు ఆర్మీలో చేరతావా?—నేవీలోనా?—ఎయిర్ స్క్వాడ్ లోనా?— ఏది సరదా?—' అని.

నన్ను కూడా పాకిస్తాన్ పంపించెయ్యాలని చూస్తున్నాడు— నేను చస్తే సైన్యంలో చేరను—నేను సైన్యంలో చేరిపోయి యుద్ధానికి వెళితే ఇంకేమన్నా వుందా? — అమ్మని బుట్టలో వేసుకుని ఇంకా పాడు చేస్తాడు—అమ్మని ఎలాగయినా నేను రక్షించాలి— అమ్మ నా మాట వినేలాగ చేసుకోవాలి— నేను యుద్ధంలోకి వెళ్ళకూడదు — తుపాకిని పారెయ్యాలి — కన్నీళ్ళు తుడుచుకుంటూ బాధగా గొణుక్కున్నాను నేను.

ఇంతలో నాకు—

'ఏరా!—నువ్వెక్కడున్నావా?— నీ గురించి నాన్న ఇందాకటినించీ అడుగుతున్నారు —' అమ్మ గొంతు వినబడింది.

నాన్న అడిగితేనే తప్ప అమ్మకి నా సంగతి గుర్తుండదన్నమాట.

'ఒక్కడివీ ఏం చేస్తున్నావ్?—' అడుగుతోంది అమ్మ—

'ఆడుకుంటున్నాను—' కోపంగా సమాధానం చెప్పాను. కాని—నా కంట్లోంచి కన్నీళ్ళు క్రిందికి జారేయి.

'ఏడుస్తున్నావా?—'. అంది అమ్మ ఆశ్చర్యంగా—

'లేదు—' అన్నాను బాధగా—

'అదేమిటి?—కళ్ళల్లో కన్నీళ్ళు కనబడుతూంటేనే—ఎందుకు?—' అంది అమ్మ నా ప్రక్కన కూర్చుంటూ—

ఎందుకట—ఎందుకు?—తనకు తెలియనట్టు — నాకు అమ్మమీద ఉక్రోషం ముంచుకు వచ్చింది.

'నేనివాళ భోంచెయ్యను—' అన్నాను మరింత కోపంగా—

నా మాటలకు అమ్మ నవ్వింది— 'బాగుంది—భోజనం మానెయ్యడానికి ఎవరయినా ఏడుస్తారా?—లే—కళ్ళు తుడుచుకో—' అంది.

ఈ ఊరడింపు నాకు మరింత బాధ కలిగించింది—ఇదివరకు నేను అన్నం మానేస్తానంటే అమ్మ ఎంత నొచ్చుకునేది!— 'నా బాబువి కదూ — నా బంగారుకొండవు కదూ—' అంటూ ఎంత బ్రతిమాలేది?—ఇప్పుడా విషయాన్ని ఎంత తేలిగ్గా తీసుకొంటోంది—

ఈ అవమానాన్ని నేను భరించలేక పోయాను—

ఒక్కసారి వరదలాగా కన్నీళ్ళు ముంచుకువచ్చాయి.


గుక్కపెట్టి ఏడ్చేశాను—

అప్పుడు అమ్మ ఎత్తుకుందని కూడా తెలియలేదు.

* * *

ప్రక్కరోజున నేను పక్కింటి సీతమ్మగారి అబ్బాయిని అడిగాను—

'ఒరేయ్—గోపీ— మవ్వంటే మీ



# నువ్వంటేనే నాకిష్టం!

అమ్మకు ఇష్టమేనా?—' అని.

'ఆ—భలే యిష్టం—' అన్నాడు గోపీ పిచ్చిక గూడు కడుతూ—

'మరి నాన్నంటే?—' నాక్కావలసిన ప్రశ్న యిది—

పిచ్చికగూడు పై భాగాన్ని నునుపుగా చేస్తూ అన్నాడు గోపి—

'ఇంకా ఎక్కువ ఇష్టం—'

'ఎందుకని?—'

'ఎందుకేమిటి—వాళ్ళిద్దరూ మొగుడూ పెళ్ళాలుగా — మొగుడూ పెళ్ళాలిద్దరికీ ఒకళ్ళంటే ఒకళ్ళకి ఇష్టం వుంటుందట—మా బామ్మ అస్తమానూ అదే గొణుక్కుంటూ వుంటుంది—'

'ఓహో!—అదా సంగతి!— అది సరే —అసలు అమ్మా, నాన్నా, మొగుడూ పెళ్ళాలు ఎట్లా అయ్యారు?—'

'బాగుందిరా నీ ప్రశ్న—మొగుడూ పెళ్ళాలవడం అంటే పెళ్ళి చేసుకోవడం అన్నమాట—నిరుడు మా అక్కకు పెళ్ళి అయింది కదా — అప్పటినించీ అక్కా, బావా, మొగుడూ పెళ్ళాలయిపోయారు — మా అక్క ఇప్పుడు కడుపుతో వుందిగా!— దానికి ఓ కూతురు పుడితే నాక్కూడా ఓ పెళ్ళాం దొరుకుతుందిట!—' గొప్పగా చెప్పాడు గోపీ—

గోపీమాటలు నాకు వినబడం లేదు— నా ఆలోచనలు ఎటో పని చేస్తున్నాయి. అమ్మకి నాన్నంటే అంత ఇష్టం వుండటానికి కారణం ఏమిటో అర్థం అయిపోయింది—

నాన్న అమ్మని పెళ్ళి చేసుకున్నాడు కనుక!—

పోనీ—నాన్నబదులు నేనే అమ్మని పెళ్ళి చేసుకుంటే...

ఈ ఆలోచన నాకు విచిత్రంగా తోచింది.

అమ్మని కనుక పెళ్ళి చేసుకుంటే— అమ్మ నేను చెప్పినట్లల్లా వింటుంది. నేను రమ్మన్నప్పుడల్లా సినిమాలకు, పార్కుకు, వస్తుంది. నన్ను దాబామీద ఎత్తుకుని ఇంకా గోరుముద్దలు తినిపిస్తుంది—ఎప్పుడూ నాదగ్గరే వుంటుంది—

ఈ ఊహ నాకెంతో సంతృప్తి నిచ్చింది—

ప్రక్కరోజు రాత్రి పడుకొనేటప్పుడు అమ్మతో అన్నాను — 'అమ్మా! నేను పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను—' అని—

ఆమాటలు నేను అన్నానో లేదో అమ్మ పగలబడి నవ్వింది—ఎవర్ని, ఎప్పుడు, ఎక్కడ—ఇలాంటి ప్రశ్నలేవీ అడక్కుండానే నాన్నని పిలిచి — 'చూశారా!— అప్పుడే మీకొడుక్కి పెళ్ళికావాలని వస్తాందట!—అన్నీ తండ్రి బుద్ధులే—వీడిగర్ల్ ఫ్రెండ్స్‌ని చూసి అనుమాన పడుతూనే వున్నాను—' అంది—

ఇంకా నవ్వుతూనే వుంది అమ్మ—

నాన్న అమ్మతో శృతి కలుపుతున్నాడు— ఇంత చిన్న విషయానికి అంతగా ఎందుకు నవ్వాల్సి వస్తోందో అర్థం కావేదు నాకు.

* * *

ఇలా వుండగా — నాన్నకు మా ప్రభుత్వం ఇచ్చిన సెలవు పూర్తయిపోయింది — బెంగుళూరులో నాన్నకు ఉద్యోగం అయిందట — అందరం వెళ్ళిపోవాలట—అమ్మ చాలా హడావిడిగా వుంది—

ఈ వూరు విడిచి పెట్టాలంటే నాకు ఏడుపొస్తోంది — పల్లెటూరయితేనేం ఇక్కడ ఆడుకోడానికి బోలెడు తోటలున్నాయి—మైదానాలున్నాయి. ఇవన్నీ విడిచి పెట్టాలంటే మాటలా?—ఈ వూళ్ళో అయితే నాకు ఆడుకోడానికి బోలెడుమంది స్నేహితులున్నారు— వాళ్ళందరినీ విడిచి పెట్టి ఎలావుండగలను? — నాన్న పాకిస్థాన్‌లో ఖైదీ అయ్యాడని తెలిసిన తర్వాత అమ్మ ఈ వూరు వచ్చిందట— నాకు నాన్న ఉద్యోగం సంగతిగానీ— మేం ఈ వూరు రావడంగానీ ఏమీ తెలియదు— అప్పటికి నేను నెలల పసివాణ్ణిట—


ఏది ఏమయినా— నాకు ఈ వూరంటే ప్రాణం—

మనం నాన్నతోబాటు వెళ్ళొద్దని చెబుదామనుకున్నానుగానీ అమ్మ నామాట వినే పరిస్థితిలో లేదని తెలిసి వూరుకున్నాను—ఏ వూరయితే నాకేం?—

* * *

బెంగుళూరు వచ్చిన తర్వాత నా పరిస్థితి మరింత చికాకుగా తయారయింది —మిలటరీ స్టాఫ్ క్వార్టర్స్‌లో అందరు మిలిటరీవాళ్ళ మధ్య వుండటం చాలా కొత్తగావుంది— నాన్నకూడా ఇదివరకటిలాగా మామూలు బట్టలు వేసుకోకుండా ప్రతిరోజూ యూనిఫారమ్ వేసుకుంటున్నాడు —యూనిఫారములో వున్న నాన్నను చూస్తే నాకు ఆశ్చర్యం వేసేది—ఈ యూనిఫారములో నాన్న మీసాలు బాగున్నాయని ఒకటి రెండుసార్లు అనుకున్నాను కూడా—

ఇక్కడికి వచ్చిన తర్వాత నాన్న ఇదివరకటిలాగా ఎక్కువసేపు ఇంట్లో వుండటం లేదు — ఎప్పుడో ప్రొద్దుగూకిన తర్వాత వచ్చి మళ్ళీ ప్రొద్దున్నే వెళ్ళి



బాపేవాడు—అందుచేత అమ్మతో మాట్లాడేందుకు ఎక్కువ అవకాశం కలిగేది—ఇది నాకు ఎంతో ఆనందాన్ని కలిగించింది—

ఇలా కొన్నాళ్ళయిన తర్వాత ఓ రోజు అమ్మ నాతో అంది—

'ఏరా — నీకు తమ్ముడు కావాలా చెల్లాయి కావాలా ?—' అని. అప్పుడు అర్థమైంది నాకు ఇంట్లోకి ఇంకో మనిషి రాబోతున్నాడని. ఇది జరిగిన కొన్నాళ్ళకు కాబోలు ఓ రోజున నాన్న హడావిడిగా టాక్సీతో వచ్చి అమ్మను డాక్టర్ దగ్గిరకు తీసుకు వెళ్ళాడు — అప్పుడు అమ్మతోబాటు నేను కూడా వున్నాను కానీ— వాళ్ళు మాట్లాడుకునే దేమిటో అర్థం కాలేదు—నాకు ఇంగ్లీష్ వచ్చునుగానీ — వాళ్ళు మాట్లాడుకునే ఇంగ్లీష్ బొత్తిగా బోధపడలేదు — కాస్త యిలా తెలుగులో మాట్లాడకూడదూ!—

ఆ ప్రక్కరోజున నాన్న అమ్మని ఆస్పత్రిలో జాయిన్ చేయించాడు — హాస్పిటల్లో అమ్మని చూచి ఏడ్చాను నేను —'నేను కూడా నీతోబాటు ఇక్కడే వుంటాను—' అన్నాను —

"ఉష్ !— తప్పు !— నువ్వెందుకూ ఇక్కడ!— ఇంచక్కా ఇంటిదగ్గిర నాన్నగారితో వుండు—'

'మరి నువ్వు ఇక్కడ ఒక్కర్తివీ వుంటావు కదా భయం వెయ్యదూ!—' అన్నాను.

'నాకెందుకూ భయం ? — ఇక్కడ బోలెడుమంది డాక్టర్లు, నర్సులు, వున్నారుగా—' అంది అమ్మ—

'మరి నాకు భయం వేస్తోంది—' అన్నాను ఏడుస్తూ—

'నీకేమీ భయం లేదు — నాన్న ఎన్నో మంచి కథలు చెబుతారు. నీకు రోజూ చాక్లెట్లుకొని యిస్తారు—'

అమ్మన్నట్లు నాన్న నన్ను దగ్గిరకు తీసుకున్నాడు—అమ్మ వున్నప్పుడే నాన్న దగ్గిర వుండటం భయం నాకు — ఇక యిప్పుడు చెప్పాలా? — అయినా నాకు ముందునించీ తెలుసు— నాన్న యిలాంటి అఘాయిత్యం చేస్తాడని — ఈ నాన్న వల్లే అమ్మకు ఈ జబ్బుచేసి వుంటుంది. ఇదివరకెప్పుడయినా యింత జబ్బు చేసిందా—?

ఇప్పుడు అమ్మకి జబ్బు చేస్తే తమ్ముడు ఎలా పుడతాడు?—

వాడితో నేను ఎలా ఆడుకోగలను?— నా ఆలోచనతో సంబంధం లేదన్నట్లు నాన్న నన్ను బరబరా లాక్కుపోతున్నాడు—రానని గోలపెట్టి అల్లరి చేద్దామనిపించింది—కాని — ధైర్యం చాలలేదు — ఏడిస్తే బాగుండదని కన్నీళ్ళు తుడుచుకుని నడుస్తున్నాను — హాస్పటల్ లోంచి బయటకు వచ్చిన తర్వాత నాన్న నన్ను కారులో కూలేసి ఓ పెద్ద హోటల్ దగ్గిరకు తీసికెళ్ళాడు—

ఇక్కడ నన్ను వదిలి పెట్టేసి వెళ్ళిపోడు కదా అని భయపడ్డాను — కాని, అలా చెయ్యలేదు—

నన్ను టేబుల్ దగ్గిరకు తీసికెళ్ళి అక్కడున్న సర్వర్‌ని రెండు ఐస్‌క్రీములు తెమ్మన్నాడు— 'ఐస్‌క్రీం' అనే మాట వినగానే నాకెంతో సంతోషమైంది— ఫర్వాలేదు— మంచివాడేనే అని అనుకున్నాను—ఒక ఐస్‌క్రీమ్ తిన్న తర్వాత మరొకటి తింటావా అని అడిగాడు — ముందు 'అలాగే' అందామనుకున్నాను గాని— ఆ తర్వాత ఒద్దన్నాను— అమ్మాత్రం బెట్టు చెయ్యాలి—

ఆ తర్వాత నన్ను సినిమాకు తీసికెళ్ళాడు—సినిమా జరుగుతున్నంత సేపూ నాకేవో కబుర్లు చెప్పి నవ్విద్దామని చూస్తున్నాడు—నాకు నిజంగానే నవ్వొస్తోంది — నాన్న నేను అనుకున్నంత దురాత్ముడు కాడు—సరదాగానే కబుర్లు చెబుతాడు—

ఆ రాత్రి పడుకునే ముందు — నాన్న నా కెన్నో కథలు చెప్పాడు—మిలిటరీలో సైనికులు ఎంత ధైర్యంగా వుంటారో చెప్పాడు— రెండో ప్రపంచ యుద్ధం గురించి చెప్పాడు — అత్యాశకు పోయిన హిట్లర్ అంటే నాకు అసహ్యం వేసింది—


ఆ రోజేకాదు — ప్రతిరోజూ నాన్న అలాంటి కథలే చెబుతూండేవాడు — ఆ కథలంటే నాకెంతో ఇష్టం — క్రమక్రమంగా ఆ కథలు చెప్పే నాన్న మీద కూడా ఇష్టం కలిగింది—ప్రతి రోజూ గుప్పెడు చాక్లెట్లు తెచ్చి నాకిచ్చే నాన్నంటే నాకెందుకు ఇష్టం వుండదు?—

నాన్న నన్ను సరిగా చూడటం లేదని— నన్ను కొడుతున్నాడని —ఎన్నో నేరాలు అమ్మతో చెబుదామనుకున్నాను —కాని — ఒక్కటీ చెప్పలేక పోయాను —

కొంపదీసి నేనూ నాన్నా స్నేహితులైపోవటం లేదుకద !

ఉహూఁ !—ఎప్పటికీ కాకూడదు — నాన్నతో స్నేహం చెయ్యకూడదు—

అలా అని నాన్నలో విరోధం తెచ్చుకోడానికి వీయిలేదు —ఎందుకంటే అమ్మ ఇంట్లో లేదు కదా !—అందుచేత నాన్న చెప్పే, కథలన్నిటిని వింటున్నట్టు నటించేవాణ్ణి మొదట — కాసేపయిన తర్వాత ఆ కథలు చెబుతున్నది ఎవరో మరచిపోయి చాలా కుతూహలంగా వినేవాణ్ణి—నాకు కథలంటే వున్న సరదా





రైల్వేస్టేషన్ వద్ద: రామాలయంవీధి.

తెల్ల మచ్చలు

అయినా ఫరవాలేదు! మా ప్రఖ్యాత ఆయుర్వేద ఔషధం "సోమరాజ్ సిల్ కపూర్" ద్వారా మచ్చల రంగులను మూడు దినములయందు మార్చును. ఒక లక్ష మందికి ఉచితముగా ఒకొక్క సీసా ఇవ్వబడును. నేడే వ్రాయండి.

Jawahar Chikitsa Kendra
(P. O.) Katrisarai (Gaya)

వాయిదాల చెల్లింపుపై ట్రాన్సిస్టర్



"బ్రా బ్రా" హామీతో 3 బ్యాండ్, ఆల్‌వరల్డ్ పోర్టబుల్ ట్రాన్సిస్టరు నెలకు రు. 5/- వంతున చెల్లించే పద్ధతిన పొందండి. ప్రతి గ్రామమునకు, నగరమునకు పంపగలము. నేడే వ్రాయండి:

HIND AGENCIES (67)
Kolhapur Road, Delhi-7-

మీకు ఆనందాన్నిచ్చే పుస్తకాలు

1.తెల్సుకోదగ్గవి:- మీ జీవితసుఖసంతోషాలకు మీరు తెలుసుకోదగ్గ అనేక వందల అద్భుత విషయాలు. రూ.5-00
2.అద్భుతహాస్యకథలు:- మీరు నవ్వటానికి యితరులను బాగా నవ్వించటానికి కొన్ని వందల నవ్వించే కథలు. రూ.3-50.
3.చేతిపనులు:- చిన్నపరిశ్రమలకు సర్కాకి సంపాదనకు ఎన్నో రకాల సరుకులు, సులభంగా చేసుకొనే విధానాలు రూ.3-50.
4.మంత్రశక్తి:- మీ కోర్కెలు నెరవేర్చుకోవటానికి వివిధ మంత్రాలు వాటి అద్భుత రహస్యాలు సాధనమార్గాలు. రూ.3-50.
5.జీవితరహస్యాలు:- మీ దాంపత్యజీవితాన్ని సంపూర్ణ ఆనందమయం చేసుకోవటానికి అనేక దివ్యకామసూత్రాలు రూ.3-50
6.యువతి:- స్త్రీలను గురించి యువతీయువకులు తెలుసుకోదగిన అనేక అద్భుత కుతూహల విషయాలు రూ.3-50.
7.సంతానము:- కామసుఖాలు అనుభవించుచు కూడ అవసరం లేనపుడు గర్భం రాకుండా 60 సులభ మార్గాలు రూ.3-50.
శ్రీటి ర్చన టి.యస్.మూర్తి, యం.ఏ. పోస్టు ఖర్చులు బత్తెం.
దేశసేవ ప్రచురణాలు, ఏలూరు.2., ఆంధ్రకు వ్రాస్తే మీకు కావలసినవి వి.పి. పోస్టుద్వారా పంపబడును.


# సుఖ్యాంతనే నాకిష్టం!

అలాంటిది?— ఏం చెయ్యను మరి?—ఈ కథలతో నాన్న నన్ను అమ్మను వేసుకున్నట్లుగా ఎత్తో వేసుకోవటం లేదు కదా!—

ప్రతిరోజూ నన్ను తన్ను తన పక్కలో పడుకోమనేవాడు—కాని—నేను మాత్రం వేరే పక్కలో పడుకునేవాణ్ణి—పక్కలో పడుకుంటే...హమ్మో!— ఇంకేమన్నా వుందా!!—

ఇలా వుండగా—వో రోజున నాకు భయంకరమైన కల వచ్చింది — అది పీడకల అని తర్వాత తెలిసిందనుకోండి—వో పెద్దభూతం నా గదిలోకి వచ్చి నన్ను అప్పడంలాగా నమిలేస్తోందట!—నేను భయస్తుణ్ణి కాదు గానీ—ఎందుకో—ఒక్కసారి కేక పెట్టాను—వళ్ళంతా చెమటలు పట్టేశాయి—

నా గోల విని నాన్న లేచాడు—

'ఏరా—పీడకల వచ్చిందా?—' అన్నాడు.

బెదురుగా తల వూపాను—

'అందుకే నా పక్కలో పడుకోమన్నాను—పెద్ద హీరోలాగ వేరే పక్కలో పడుకున్నావు—' అంటూ నన్ను తన పక్కలోకి పిలిచాడు—ఆప్యాయంగా నా వంటిమీద చెయ్యివేశాడు—భయంతో నాన్నని కౌగలించుకున్నాను నేను—నాన్నని కౌగలించుకుంటే వెచ్చగా వుంది—అమ్మపక్కన పడుకున్నట్టేవుంది — నాన్నకూడా మంచివాడనే అనుకున్నాను—

ఆరోజు మొదలు నాన్న పక్కలోనే పడుకునేవాణ్ణి — నా వంటిమీద నాన్న చెయ్యి వేస్తేనే గాని నాకు నిద్రపట్టేది కాదు—అలా నేనూ, నాన్నా, స్నేహితులం అయిపోయాం—

అలాంటప్పుడు తమ్ముడితో అమ్మ ఇంట్లోకి వచ్చింది—తమ్ముడు పుట్టాడని నాకు చాలా సంతోషంగా వుంది—కాని—వాడు ఠణపిశాచి—ఎప్పుడూ ఏడుస్తూనే వుండేవాడు—తను నిద్రపోయేవాడు కాదు — మమ్మల్ని నిద్రపోనిచ్చేవాడు కాదు—

వాడు అంత గోలపెడుతున్నా సరే—అమ్మ వాణ్ణి ఏమి అనేది కాదు—నాకోసం కాకపోయినా—కనీసం నాన్నకోసమయినా వాణ్ణి కోప్పడవచ్చు కదా!—

తమ్ముడు వచ్చాక—అసలు నాకు నామాట సరేసరి—నాన్నమాట కూడా లక్ష్యం లేకుండా పోయింది—నాన్న ఎంతగా అడిగినా సరే సినిమాలకు, షికార్లకు, వచ్చేది కాదు—ప్రతీదానికీ,

'బాబుకు ఇది పడదు—'

'బాబుకు ఆలస్యం అవుతుంది—'

'ఉశ్!—బాబు లేచిపోతాడు—'

ఇలా అంటూ వుంటుంది—పాపం—నాన్న మంచివాడుగా మరి!—అందుచేత ఏమీ అనేవాడు కాదు—నాకు మాత్రం అమ్మమీద కోపం వచ్చేది — నాన్నతుపాకీ తీసుకుని 'ఢాం' 'ఢాం' అని పేల్చేద్దామనిపించింది—,

అందుకనే నేను అస్తమానూ నాన్నతోనే వుండే వాణ్ణి—స్కూలు నించి రాగనే నాన్నకోసం ఎదురు చూస్తూ కూర్చునేవాణ్ణి—నాన్న ఎంత మంచివాడని—నాకు ఎన్ని బొమ్మలు కొనిపెట్టాడో—నన్ను ఎన్ని సినిమాలకు తీసికెళ్ళాడో మీకేం తెలుసు? — నాన్న కొనే బొమ్మలన్నీ నాకే! — ఒక్కటీ అమ్మకీ, తమ్ముడికీ, ఇచ్చేది లేదు—ఎందుకివ్వాలి?—

* * *

ఆ రోజులు తలుచుకుంటూ వుంటే నాకు నవ్వొస్తూ వుంటుంది. ఇప్పుడు తమ్ముడు కూడా పెద్దవాడయ్యాడు. వాడిప్పుడు నాలాగా నడవగలుగుతున్నాడు — కోపం వస్తే కరుస్తాడన్నమాటేగాని, మిగతా బుద్ధులన్నీ మంచివే — అందుకే నాకు వాడిమీద కూడా కోపం పోయింది. ఇంక అమ్మ సంగతి సరేసరి—అమ్మమీద నాకు ఎప్పుడూ కోపం లేదన్న సంగతి మీకు తెలిసిందే!—

ఇప్పటికే మీతో చాలాసేపు మాట్లాడాను—నాకోసం నాన్న ఎదురు చూస్తూ వుంటారు వెళ్ళాలి—ఇప్పటికయినా అమ్మ సినిమాకు బయలుదేరిందో లేదో — తమ్ముడు వో పట్టాన తల దువ్వించుకోడు కదా!— అందుకే నాకు వాడంటే కోపం!—